క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి



పిడుగురాళ్ల: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని గంగమ్మతల్లి దేవాలయంలో ఆదివారం గంగమ్మతల్లిని ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులను తీర్చుకున్నారు. భక్తుల రాకతో ఆలయ కిటకిటలాడింది.

తుమ్మలచెరువులో ఉచిత వైద్యశిబిరం



పిడుగురాళ్లరూరల్: మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలోని పవన్ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ రామ్‌పవన్‌కుమార్ పాల్గొని రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ వైద్యశిబిరంలో ఈసీజీ, బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ వైద్యశిబిరాన్ని ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శుద్ధి చేసిన విత్తనాలు నాటాలి



దాచేపల్లి: విత్తనశుద్ధి చేసిన తరువాతే విత్తనాలు నాటాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళి అన్నారు. దాచేపల్లిలోని యర్రంశెట్టి నరసింహస్వామి పత్తి పంటను ఆదివారం ఆయన పరిశీలించారు. పంట సాగులో రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. పత్తి, మిరప పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వ్యవసాయశాఖ అధికారి మురళి వివరించారు. విత్తన మొలక శాతం సూచించేందుకు సీడ్ జర్మినేషన్ ప్రక్రియ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ–క్రాప్ గురించి కూడా రైతులకు వివరించి ప్రతి రైతు పంటల ఈ–క్రాప్ బుకింగ్ చేయాలని ఆయన చెప్పారు. రైతు భరోసా కేంద్రాలు రైతులకు ప్రయోజకరంగా ఉండేందుకే ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, పంటల సాగులో రైతులు సలహాలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి మురళీ తెలిపారు. ఏడీఏలు రవికుమార్, శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ పాపకుమారి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'మన గ్రోమోరు' పరిశీలన

గురజాల: స్థానిక కోత మిషన్ సెంటర్‌లో వున్న మన గ్రోమోరు – మన కోరమండల్‌ను వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనివారం గురజాలకు చెందిన రైతు జింకు ప్యాకెటు కొనుగోలు చేస్తే అందులో ముగ్గు పౌడర్ కొంత ఉన్నట్లు వచ్చిన వార్తలను దృష్టిలో వుంచుకుని ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రోమోరు సెంటర్ బిల్లు బుక్స్‌లను పరిశీలించి రైతు చేసిన ఆరోపణలను దృష్టిలో ఉంచుకుని కంపెనీకి చెందిన ప్యాకెట్‌ల నుంచి శాంపిల్స్‌ను స్వీకరించినట్లు ప్రస్తుతం ఆ స్టాక్‌ను విక్రయించకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తీసిన శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించడం జరుగుతుందన్నారు. కంపెనీ ప్యాకెట్‌లో ఏమైనా ఆరోపణలు నిజమైతే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం

గురజాల: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మీసాల దానియేలు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటింటికి ఓటర్ సర్వేను విజయవంతం చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి విచారణ జరిపి మరణించిన వారు ఉంటే వారి ఓటును తొలగించాలని, నూతనంగా ఓటు హక్కు పొందాలంటే ఫారం 6ను పూరించాలన్నారు. ఈ నెల 21వ తేదీ లోపు ఇంటింటి సర్వేను పూర్తి చేయాలన్నారు. వంద శాతం ఇంటింటి సర్వే పూర్తి చేసిన నలుగురు బీఎల్‌వోలను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన శ్రీనివాస్ తదితరులున్నారు.

1200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

పిడుగురాళ్ల: మండలంలోని జూలకల్లు అటవీ ప్రాంతంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్, బోర్డర్ పోలీస్ సిబ్బంది నాటు సారా తయారీకి ఉపయోగించే పులిసిన బెల్లపు ఊటను ఆదివారం ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో సుమారు 1200 లీటర్ల నాటుసారా తయారు చేసేందుకు దాచిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామని సెబ్ సిబ్బంది తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నామన్నారు. ఈ దాడుల్లో సెబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. కొండారెడ్డి, సిబ్బంది శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, శివరాం ఉన్నారు.

సేవాలయాలు.. రైతు భరోసా కేంద్రాలు

- అన్నదాతకు సమయం.. ధనం ఆదా
- అన్ని సేవలూ ఆర్బీకేలో లభిస్తున్న వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



కొత్తపల్లి గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

మాచర్ల రూరల్: నిరంతరం శ్రమించే రైతన్నల కష్టాలను సుదీర్ఘ పాదయాత్రలో తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు మంచి ఫలితాలు అందిస్తున్నాయి. వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం సాగించే రైతన్నలకు ఇవి ఎంతగానో సహాయపడుతున్నాయి. ఒక్క వ్యవసాయ శాఖ సంబంధ సేవలే కాకుండా, ఉద్యానవన, ఏపీఎంఐపీ, పశుసంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్ శాఖల సేవలన్నీ గ్రామ స్థాయిలోనే అందిస్తున్నాయి. దీంతో రైతన్నలకు సమయం, డబ్బులు ఆదా కావటంతో పాటు మండల కేంద్రాలకు వెళ్లే శ్రమ తప్పింది. నియోజక వర్గంలోని వెల్దుర్తి, మాచర్ల, దుర్గి, కారంపూడి, రెంటచింతల మండలాలలో 73 ఆర్‌బీకేలను ఏర్పాటు చేశారు. వ్యవసాయంలో పెట్టుబడి తగ్గించి ఉత్పాదనను పెంచటం, ఇన్‌పుట్స్ విత్తనం మొదల నుంచి పండించిన పంటను మార్కెట్ ధరలో అమ్మేందుకు ఆర్‌బీకేలు అండగా నిలుస్తున్నాయి. అంతేకాకుండా వ్యవసాయ విజ్ఞానానికి సంబంధించిన వివిధ రకాల పుస్తకాలతో మినీ లైబ్రరీలు ఏర్పడ్డాయి. రైతుల సందేహాలు, సలహాలిచ్చేందుకు ప్రత్యేక ఉద్యోగిని ఏర్పాటు చేశారు. రైతులకు ఆడియో, వీడియోల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు అందిస్తూ డిజిటల్ క్లియోస్క్ ద్వారా వారికి అవసరమైన వాటిని ఆర్డర్ పెడితే చాలు వారి ఇంటి ముందుకు తెచ్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

పొలం బడి.. నూతన ఒరవడి

పంటల సాగులో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఆర్‌బీకేల వారీగా పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పత్తి, మిర్చి, వేరుశనగ, వరి, మినుమ, కంది, చిరుధాన్యాలు, తదితర పంటల్లో పొలంబడి కార్యక్రమం జరుగుతుంది.

ఆర్‌బీకేతో ఎన్నో లాభాలు..

సబ్సిడీపై పంపిణీ చేసే విత్తనాలతో పాటు నాన్ సబ్సిడీ విత్తనాలు అందిస్తున్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల నాణ్యత ప్రమాణాలను శాస్త్రీయంగా పరీక్షించిన తరువాతనే రైతులకు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రాప్ ద్వారా ఖర్చులేకుండా రైతులు భీమా సదుపాయం పొందుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలలో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందిస్తున్నారు. పండించిన పంటలను నాణ్యమైన ధరకు ఆర్‌బీకేలోనే అందిస్తున్నారు.

రైతన్నకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం..



వ్యవసాయంలో నూతన ఒరవడికి తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే. ఆర్‌బీకేలు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అధిక ధరలకు కొనుగోలు చేయకుండా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందిస్తూ పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ అన్నదాతకు అన్ని విధాల అండగా వెన్నుదన్నుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలుస్తోంది.
– కుర్రి సాయి మార్కొండారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్

రైతులకు వరం



గ్రామాలలో రైతుల ముంగిట ఏర్పాటుచేసిన రైతు భరోసా కేంద్రాలు రైతన్నకు అండగా ఉంటున్నాయి. ఎరువులు, పురుగుమందులు కేంద్రాలలోనే కొనుగోలు చేస్తున్నాం. విలువైన సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయ నిపుణులు అందుబాటులో ఉండటం ఆనందకరం. ఆర్‌బీకేలు రైతన్నలకు అండగా నిలుస్తున్నాయి.
– ఒరుగంటి జయప్రకాష్‌రెడ్డి, కొత్తపల్లి సర్పంచ్

ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్

ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ ఎం.రాజారెడ్డి



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ ఎం.రాజారెడ్డి

పిడుగురాళ్ల: ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ ఎం.రాజారెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో కార్మికులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆర్టీసీ నుంచి వచ్చిన ఆదాయాన్ని ట్యాక్స్ రూపంలో దండుకున్నాడని, అంతేకాకుండా 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉండి ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయమని అడగ్గా నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ప్రభుత్వంలో విలినం చేసేంత పిచ్చివాడిని కాదంటూ విజయవాడ సభలో నేరుగా ఆర్టీసీ కార్మికులతోనే అన్నారని గుర్తుచేశారు. అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర చేసే సమయంలో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తానని హామీ ఇచ్చి ఇచ్చిన మాట ప్రకారం వెంటనే ప్రభుత్వ రంగ ఉద్యోగులుగా గుర్తించారన్నారు. కొంత మంది దీనిపై చేసే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దన్నారు. కార్మికుల జీవితాలల్లో వెలుగులు నింపాలని రాష్ట్ర ముఖ్యమంత్రి పరితపిస్తున్నారని, మనం ఏది అడిగినా కాదనకుండా నెరవేరుస్తున్నారని ఆయన తెలియజేశారు. ఆర్టీసీ ఆదాయం ఆర్టీసీకి మాత్రమే ఉపయోగించుకోవాలని గుర్తించి, అప్పుల్లో ఉన్న ఆర్టీసీని, ఆదాయం కలిగిన సంస్థగా మార్చేందుకు సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. పిడుగురాళ్ల డిపోలో కాంపౌండ్ వాల్‌నిర్మాణానికి డీటీపీఓ ద్వారా లెటర్ పెట్టిస్తే వెంటనే నిధులు మంజూరు అయ్యేలా చేస్తానని ఆయన తెలియజేశారు. ఆర్టీసీ డీటీపీఓ వెంకటేశ్వర్లు, డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు, కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు జూలకంటి శ్రీనివాసరావు, ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి బలవన్మరణం

గురజాల: పురుగుమందు తాగి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....మండల పరిధిలోని పులిపాడు గ్రామానికి చెందిన లట్టుపల్లి బ్రహ్మయ్య (45) వ్యవసాయంతో పాటు హోటల్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో 3 ఎకరాల పొలంను కౌలుకు తీసుకుని పత్తి, మిరప పంటలను సాగుచేస్తున్నాడు. గత రెండు సంవత్సరాలుగా పత్తి పంట దిగుబడి రాకపోవడం, మిరపకు తెగుళ్లు సోకడంతో పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి, కుమార్తె వివాహానికి రూ.6 లక్షలు, హోటల్ నిర్వహణకు రూ.1.50 లక్షలు, వ్యవసాయానికి రూ.3.50 లక్షలు మొత్తం రూ.11 లక్షల అప్పు ఉన్నట్లుగా చెబుతూ, గత కొన్ని రోజులుగా అప్పులు ఎలా తీర్చాలి అని మనస్తాపం చెందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం రాత్రి ఇంటి పక్కన ఉన్న పశువుల కొట్టంలోకి వెళ్లి పురుగు మందు తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే గ్రామంలో ఆర్‌ఎంపీ వద్దకు తీసుకువెళ్లగా ప్రథమచికిత్స అనంతరం గుంటూరు వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో వైద్యులు పరిశీలించి మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించారు. మృతుడి భార్య జానకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఒక పాప, బాబు కలరు.

'కాపు యువత' ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న తోటకూర శంకర్

దుర్గి: మండల పరిధిలోని ముటుకూరు గ్రామానికి చెందిన చెన్నం శెట్టి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ముటుకూరు కాపు సేవా సమితి సభ్యులు రూ. 70వేలు ఆర్థిక సాయం అందజేసి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. ఆదివారం బాధితుడి గృహానికి వెళ్లిన సేవా సమితి ప్రతినిధి తోటకూర శంకర్ రూ.70వేలు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ముటుకూరు కాపు సేవా సమితి సభ్యులు వివిధ దేశాలలో నివసిస్తున్న ఎన్‌ఆర్‌ఐల సహకారంతో ఆర్థిక సాయం అందజేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మరెన్నో మంచి కార్యక్రమాలను చేపట్టబోతున్నట్లు వివరించారు. విద్య, వైద్యం విషయాలలో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నవారికి అండగా ఉంటామన్నారు. సేవా సమితికి సహకరించిన ఎన్‌ఆర్‌ఐ సభ్యులు గోపయ్య, శ్రీను, వెంకట్రామయ్య, శ్రీకాంత్, సతీష్, అశోక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు నెలల్లో పెద్దమద్దూరు బ్రిడ్జిని ప్రారంభిస్తాం



అమరావతి: మండల పరిధిలోని పెద్దమద్దూరు వద్ద హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఆదివారం పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ అమరావతి నుంచి తుళ్లూరు డబుల్‌రోడ్డు నిర్మాణం, పెద్ద మద్దూరు వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం అత్యవసరమని భావించిన జగనన్న ప్రభుత్వం రూ.44 కోట్ల నిధులను ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా నిధులను మంజూరు చేయటంతో పనులు మొదలుపెట్టామన్నారు. ఈ బ్రిడ్జికి కావాల్సిన 5 ప్రధాన పిల్లర్లలో 4 పూర్తయ్యాయని ఐదో పిల్లర్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. మిగిలిన పనులు త్వరగా పూర్తిచేసి రెండు నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. ఈసందర్భంగా పనులు మరింత వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌లను, ఆర్‌అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే శంకరరావు ఆదేశించారు.

నూర్‌బాషా సంఘీయులు ఐక్యంగా ఉండాలి



నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

మాచర్ల: పల్నాడు జిల్లాలో నూర్‌బాషా సంఘం నాయకులంతా ఐక్యంగా పనిచేసి సంఘాన్ని బలోపేతం చేయాలని నూర్‌బాషా ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షుడు మహమ్మద్ ఖాజావలి అన్నారు. ఆదివారం పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ భవనంలో జరిగిన సమావేశంలో పల్నాడు జిల్లా నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఖాజావలి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 20లక్షల మందిలో 30శాతం నూర్‌బాషాలున్నారన్నారు. సమిష్టిగా అందరూ నూర్‌బాషా సంఘ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పల్నాడు జిల్లా నూతన అధ్యక్షుడు జాని బాషా (మార్బుల్ జాని), కార్యదర్శులుగా ఖాసిం సైదా, పల్నాడు జాని, యూత్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సలీంలను నియమించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగర అధ్యక్షుడు ఆదం షఫీ, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి నాగూర్‌వలీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ బాదన్ బాయి, మాచర్ల మండల అధ్యక్షుడు సయ్యద్ మస్తాన్ తదితరులున్నారు.

సత్రశాల దేవస్థానంలో ప్రత్యేక పూజలు



సత్రశాల నాగేంద్రస్వామి వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న అతి పురాతనమైన ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి వారి దేవస్థానం ఆవరణలోని నాగేంద్ర స్వామి వద్ద శ్రావణమాస చవితి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు చిట్టేలా శివయ్య శర్మ నేతృత్వంలో భక్తులు పూజలు చేశారు. శ్రావణమాసంలోని ఈ నాగ పంచమి పవిత్రమైన రోజున మహిళలు రాణుబాయి వ్రతాన్ని ఆచరిస్తారు. నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టలోని పాములకు పాలు, గుడ్లు నైవేద్యంగా సమర్పించడం వలన సర్ప దోషాలు తొలిగిపోయి శుభ ఫలితాలు వస్తాయని భక్తుల నమ్మకం. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బొద్దూరి బ్రహ్మారెడ్డి, ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముత్యాలమ్మ తల్లికి బోనాలు

రాజుపాలెం: మండలంలోని అనుపాలెం గ్రామంలో శ్రావణ మాసంలో ముత్యాలమ్మ తల్లికి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ఆదివారం మహిళలు పొంగళ్లు పొంగించి బోనాలు నెత్తిన పెట్టుకుని గ్రామంలో బ్యాండ్ వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి బోణాలు సమర్పించారు. ప్రతీ ఏడాది శ్రావణమాసంలో వచ్చే మొదటి ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా మహిళా భక్తులు నిర్వహిస్తారు.

పీడీఎం సభను జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న పీడీఎం, ప్రజాసంఘాల నాయకులు

నకరికల్లు: పీడీఎం రాష్ట్ర నాయకుడు కనకాచారి వర్ధంతిని ఈనెల 24న గుంటూరులో నిర్వహించనున్నట్లు ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ విధానాలను ప్రశ్నిస్తూ పేదప్రజల పక్షాన నిలిచి హతుడైన కనకాచారిని స్మరించుకుంటూ మణిపూర్‌లో జరుగుతున్న పరిణామాలపై వాస్తవాలను చర్చించే సభ జరుగుతుందన్నారు. వక్తలుగా విరసం నాయకులు సీఎస్‌ఆర్ ప్రసాద్, సీఎల్‌సీ నాయకులు డాక్టర్ రాజారావు, పీడీఎం సీనియర్ నాయకులు వై.వి.ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమంలో పీడీఎం సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు షేక్.మస్తాన్‌వలి, కార్యదర్శి జి.రామకృష్ణ, లాలూ, గిరిజనసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోటానాయక్, మాలమహానాడు సోషల్‌మీడియా ఇన్‌చార్జి గోదాబాల, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్.సైదా తదితరులు పాల్గొన్నారు.

అధికారం కోసం పార్టీలు మారలేదు

- పవన్ కల్యాణ్‌లా అమ్ముడు పోలేదు
- విశ్వాసంతో వైఎస్సార్ కుటుంబం వెంట నడుస్తున్నాను
- ఈ నెల 22న జరిగే బీసీ గర్జనతో సత్తెనపల్లిలో ఎన్నికల శంఖారావం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: అధికారం కోసం కన్నా లక్ష్మీనారాయణ లాగా పార్టీలు మారలేదని, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లా అమ్ముడు పోలేదని, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడులా మోసాలు చేయలేదని, విశ్వాసంతో నాడు వైఎస్ రాజశేఖర రెడ్డిని – నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్ముకొని వారి వెంట నడుస్తున్నానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మున్సిపల్ కౌన్సిలర్లు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన బహుజన వర్గాల సమక్షంలో జరిగే బీసీ గర్జనతో ఎన్నికల సమర శంఖారావం పూరిస్తున్నామన్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్‌గా నియమితులైన నిమ్మకాయల రాజనారాయణకు, విద్యాభివృద్ధి మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన యనమాల నాగార్జున యాదవ్‌కు జరుగుతున్న సన్మాన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా పేద బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండేందుకు యువ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నారని వివరించారు. పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమాన్ని భవిష్యత్తులో కొనసాగించు కోవాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆయా సామాజిక వర్గాలు అండగా ఉండాలని కోరారు. పార్టీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇద్దరు బీసీ నాయకులకు రాష్ట్రస్థాయి పదవులు ఇవ్వటం అంటే సత్తెనపల్లి నియోజకవర్గంతో పాటు బీసీ సామాజిక వర్గానికి సన్మానంగా భావించాలని వివరించారు. నిమ్మకాయల రాజనారాయణ, యనమాల నాగార్జున యాదవులను ఘనంగా సన్మానించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ సహారా మౌలాలి, సత్తెనపల్లి మండల పార్టీ కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి, ఏంజెర్ లింగారెడ్డి, నక్క శ్రీను, రెండెద్దుల వేంకటేశ్వర రెడ్డి,పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, శిరిగిరి గోపాలరావు, కట్టా సాంబయ్య ,ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలక జైపాల్, డేవిడ్ రాజు, ధూళిపాళ్ల ది ఆంధ్రా బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నలబోతు శివన్నారాయణ, పట్టణ కౌన్సిలర్లు, పలువురు నాయకులు, బీసీ సంఘాల నేతలు, తదితరులు ఉన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



సత్తెనపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహం పూర్తిగా దగ్ధమైన సంఘటన పట్టణంలోని 6వ వార్డులోని భీమవరం డొంకరోడ్డులో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం డొంక రోడ్డులో నివసిస్తున్న సయ్యద్ జాన్ సైదా పెంకుటింటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలారేగాయి. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలు ఆర్పివేశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. గృహంలో ఉన్న బీరువా, విలువైన పత్రాలు, సామగ్రి, దుస్తులు మొత్తం అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా. ఆరో వార్డు కౌన్సిలర్ సదనం సత్యవాణి, హరి మిత్రమండలి అధ్యక్షుడు సదనం హరి, మిత్ర బృందం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు.

పాత కక్షల నేపథ్యంలో ఘర్షణ

ఇద్దరికి గాయాలు

నాదెండ్ల: చందవరంలో పాతకక్షల నేపథ్యంలో ఆదివారం ఉదయం రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన గొంటు శ్రీనివాసరెడ్డి, ఆయన మేనమామ చేరెడ్డి కృష్ణారెడ్డి, అదే గ్రామానికి చెందిన గొంటు జయభాస్కరరెడ్డికి ఆస్తి తగాదాలున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో చేరెడ్డి కృష్ణారెడ్డి బైక్‌పై వెళ్తుండగా, జయభాస్కరరెడ్డి ట్రాక్టర్‌తో ఢీకొన్నాడు. అంతటితో ఆగకుండా గొడ్డలితో దాడి చేయబోగా, కృష్ణారెడ్డి తప్పించుకున్నాడు. ఆయన సోదరుడైన గొంటు శ్రీనివాసరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వారించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్యా ఘర్షణ చోటు చేసుకోగా జయభాస్కరరెడ్డి ఆవేశంతో శ్రీనివాసరెడ్డిపై దాడి చేశాడు. దీంతో గాయాలపాలైన కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డిలను కుటుంబ సభ్యులు నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘర్షణపై ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు వార్డుల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఏకగ్రీవం



గువ్వల శ్రీదేవి, (మల్లవరం 5వ వార్డు)



డి.రామయ్య, (తుమ్మకోట 14వ వార్డు)

రెంటచింతల: మండలంలోని తుమ్మకోట గ్రామం 14వ వార్డులో దేవనబోయిన రామయ్య, మల్లవరం గ్రా మంలో 5 వ వార్డులో గువ్వల శ్రీదేవి ఇద్దరూ వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. ఈ రెండు గ్రామాలలో పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవం కావడంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు.

మూఢనమ్మకాలపై జేవీవీ పోరాటం

మాచర్ల: సమాజంలో మూఢనమ్మకాలను పారదోలే విధంగా అందరూ సహకరించాలని పల్నాడు జిల్లా జన విజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర నాయకుడు వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కాలేజీలో కేశం ఆదినారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.